# గడప గడపకు బీఆర్ఎస్ ప్రచారం

- ప్రచారంలో దూసుకుపోతున్న లాస్యనందిత
- ఇప్పటికే మొదటి దఫా ఎన్నికల ప్రచారం ముగింపు
- స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి, కాషాయానికి అభ్యర్థి కరువు
- విపక్ష పార్టీల నేతల్లో లోపించిన సమన్వయం
- కారెక్కేందుకు సిద్ధమైన పలువురు విపక్ష నేతలు
- అడుగడుగునా బీఆర్ఎస్ అభ్యర్థికి బ్రహ్మరథం



ఎన్నికల ప్రచారంలో భాగంగా మూడో వార్డులో ప్రజలతో మమేకమై ముందుకుసాగుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత (ఫైల్)

కంటోన్మెంట్, నవంబర్ 3: అసెంబ్లీ ఎన్నికల్లో కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు సునాయాసం కాబోతుంది. ఇప్పటికే బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత మొదటి దఫా ఎన్నికల ప్రచారాన్ని ముగించేసింది. కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న లాస్య నందిత ప్రచారంలో జోరు పెంచడంతో పాటు అన్ని వర్గాల ప్రజలను కలుపుకుని ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగా పలు ప్రచార రథాలు ఏర్పాటు చేయడంలో పాటు నియోజకవర్గంలోని ప్రతి వార్డులో, మోండా డివిజన్ పరిధిలో ఆమెకు మద్దతుగా ప్రచారం జోరుగా సాగుతుంది. బీఆర్ఎస్ తొమ్మిదేండ్ల పాలనలో కంటోన్మెంట్ నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును వివరిస్తూ ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నియోజకవర్గం ఊహించని విధంగా అభివృద్ధి జరుగుతుందన్న అభిప్రాయాన్ని ఇక్కడి ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

## బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు తథ్యం

కంటోన్మెంట్ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపు తథ్యంగా కనిపిస్తుంది. అందుకోసం ప్రచార జోరు, వ్యూహాలతో ముందుకు సాగుతున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల ప్రకారం ఇదే జోరు నగరానికి చెందిన అన్ని నియోజక వర్గాల నుంచి పోటీ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు కొనసాగిస్తున్నారు. నగరం పరిధిలో అన్ని నియోజక వర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు ఏకపక్షమే కాబోతున్నదని, ఇందుకు నగర అభివృద్ధి, సంక్షేమ ఫలాల్లో భాగంగా షాదీముబారక్, ఆసరా పింఛన్లు, డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు, తదితర పథకాలు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు దోహదపడుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా కంటోన్మెంట్‌లో దివంగత ఎమ్మెల్యే సాయన్న చేసిన అభివృద్ధితో పాటు సీఎం కేసీఆర్ ఈ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించడంతో లాస్యనందిత గెలుపు తథ్యమన్నారు.

## విపక్ష పార్టీల్లో సమన్వయ లోపం

బీఆర్ఎస్ పార్టీ మినహా.. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు, పార్టీ శ్రేణుల్లో సమన్వయం లోపించినట్లు కనిపిస్తున్నది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల విషయంలో సమన్వయం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. గద్దర్ కూతురు వెన్నెలకు టికెట్ కేటాయించడంపై అసంతృప్తిగా ఉన్న పలువురు నేతలు కారెక్కేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ల మధ్య పొసగడం లేదు.ఇదిలా ఉండగా ఇప్పటి వరకు కాషాయం పార్టీ అభ్యర్థినిని కూడా ప్రకటించలేని స్థితిలో ఉంది. ఓ వైపు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ప్రచార వ్యూహాలు రచించుకుంటూ ముందుకు సాగుతుంటే, కాంగ్రెస్, బీజేపీకి చెందిన నాయకులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నారు





కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత విజయాన్ని కాంక్షిస్తూ మూడో వార్డుకు చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ముమ్మర ప్రచారం నిర్వహించారు. మడ్‌ఫోర్డ్ అంబేద్కర్ హట్స్, కట్టకింది బస్తీ ప్రాంతాల్లో నాయకులు ఇంటింటికెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి లాస్యనందితను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ పార్టీ యూత్ నాయకుడు బి. సాయికిరణ్, నేతలు సాంబ అశోక్, వెంకట్, మొగిలి, రోషప్ప, దుర్గేష్, శ్రీను, అనిల్, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు. –కంటోన్మెంట్, నవంబర్ 3



## నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు

అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని భద్రతా ఏర్పాట్లను నార్త్‌జోన్ పోలీసులు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి నామినేషన్ల పర్వం మొదలు కావడంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కావడంతో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరిగింది. ఇప్పటికే నార్త్‌జోన్ పరిధిలో నేర చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిని గుర్తించి బైండోవర్‌లు చేయడం గమనార్హం. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి మొదటి రోజు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. – కంటోన్మెంట్, నవంబర్ 3:

## నిజాయితీపరులను గెలిపించాలి

హిమాయత్‌నగర్,నవంబర్3: పేదలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం దక్కాలంటే నిజాయతీపరులను ఎన్నుకొని చట్టసభల్లోకి పంపి ప్రజాస్వామ్యంను కాపాడుకోవాలని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు పి.కె నరేష్ కుమార్,రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి జుమ్మి గోపాల్ ప్రజలకు పిలుపు నిచ్చారు.శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు శ్రీనివాస్,నవీన్‌కుమార్,విఠల్ పాల్గొన్నారు.

## ఐక్యంగా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

### కంటోన్మెంట్ ఐదో వార్డు నేతలతో మంత్రి తలసాని భేటీ



కంటోన్మెంట్ ఐదో వార్డుకు చెందిన పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేసిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్/మారేడ్‌పల్లి, నవంబర్ 3: పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పని చేసి కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్య నందితను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద కంటోన్మెంట్ ఐదో వార్డుకు చెందిన అధ్యక్షుడు కిరణ్, వార్డు పార్టీ ఇన్‌చార్జి నర్సింహ యాదవ్, ఇతర ముఖ్య నాయకులతో మంత్రి సమావేశమయ్యారు. ఏమైనా విబేధాలు ఉంటే పక్కన పెట్టి పార్టీ అభ్యర్థిని గెలిపించుకొనే విషయం పైనే దృష్టి సారించాలని అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం దివంగత ఎమ్మెల్యే సాయన్న ఎంతో కృషి చేశారని, ఆయన కుమార్తె లాస్య నందితకు సీఎం కేసీఆర్ పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ఇంటింటికెళ్ళి వివరిస్తూ ఓట్లను అభ్యర్థించాలని వివరించారు. ఈ సమావేశంలో వార్డు జనరల్ సెక్రెటరీ పెంట శ్రీహరి, వైస్ ప్రెసిడెంట్ రావుల సతీష్, నాయకులు గిరిరావు, యాదగిరి, రిచర్డ్, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలు లేకుండా కృషి

బొల్లారం,నవంబర్ 3: విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం లోతుకుంట విద్యుత్ కార్యాలయంలో వినియోగదారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి ఫిర్యాదుల పత్రాలు తీసుకొని,విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.కార్యక్రమంలో డీఈ సుచేందర్ నాథ్, ఏడీఈ రామాచారి,ఏఈ భరత్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ .. ముమ్మర తనిఖీలు



వారాసిగూడలో కారును తనిఖీ చేస్తున్న ఎలక్షన్ స్క్వాడ్ అధికారులు

సికింద్రాబాద్,నవంబర్3: ఎన్నికల సందర్భంగా అధికారులు తనిఖీలను ముమ్మరం చేశారు. శుక్రవారం సికింద్రాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఎలక్షన్ స్క్వాడ్ ప్రత్యేకంగా తనిఖీలను చేపట్టారు.ఎన్నికల సందర్భంగా డబ్బులను వాహనాలలో తరలిస్తున్నారన్న సమాచారంతోనే ఈతనిఖీలను చేపట్టినట్లు అధికారులు తెలిపారు.ప్రధానంగా సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని వారాసిగూడ,చిలకలగూడ,రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.



క్రీడా పోటీలు ప్రారంభం: 52వ జాతీయ ఆర్చరీ క్రీడా పోటీలను పురస్కరించుకొని బొల్లారం కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు. బొల్లారం, నవంబర్ 3